# కన్నీటి శాపం

పదిరోజుల్నుంచి ప్రకాశం కనబడక పోయేసరికి సుజాతకు పిచ్చెత్తి నట్టయ్యింది. ఇంతకుముందు, ప్రకాశం ప్రతీదినం వచ్చి, సరదాగా కబుర్లుచెప్పి వెళ్ళేవాడు. అటువంటివాడు ఇప్పుడు రావడమే మానేశాడంటే సుజాతకు ఏమిటోలా వుంది. బహుశా, అతని ఆరోగ్యం బాగులేదేమోనన్న సందేహంకూడా ఆమెలో మొలకెత్తిందంటే, ఆశ్చర్యమేమీలేదు. ప్రకాశంపట్ల ఆమెకిగల నమ్మకం అట్లాంటిది. ఎంతో అనివార్య పరిస్థితిలోతప్ప, తనదగ్గరకి రాకుండా వుండడని ఆమె అభిప్రాయం.

సుజాత తల్లి, రాజ్యంకూడా అదే అభిప్రాయపడింది. నిజానికి ఆమెకి ప్రకాశమంటే, ప్రత్యేకమైన అభిమానం వుంది. అందుకే, యితర సంబంధాలు వస్తున్నాసరే, వాటిని త్రోసిపుచ్చి, సుజాత పెళ్ళి ప్రకాశంతోనే జరిపించాలన్న నిర్ణయానికి వచ్చింది యేనాడో!

పరిస్థితి యింత పటిష్టంగా తయారయ్యింది గాబట్టే, ప్రకాశం రాకపోవడం గురించి, సుజాత కలవర పడింది విష

యం యేమిటో తెలుసుకోవడం తప్పని సరి అనిపించింది. అందుకే వుపేక్షించకుండా ప్రకాశం యింటికి బైలు దేరింది.

సాయంకాల సమయం. సంజ వెలుగు యింకా కాస్త వున్నానంటోంది. సుజాత, ప్రకాశం యింటి దరిదాపులకు వెళ్ళింది. అప్పుడే ప్రకాశం వస్తూవుండటం గమనించింది. అతని ప్రక్కనే ఓ యువతి నవ్వుకుంటూ నడుస్తోంది. సుజాత వుత్సాహం అడుగంటిపోయింది. ఆమె మొహం అమావాస్య చంద్రుడయ్యింది ఆమె గుండెలు జోరుగా కొట్టుకో సాగాయి. ఆమె ఆశలూ, ఆలోచనలూ, ఆకాశ హర్మ్యాలయినందుకు, ఆమెకి యేడుపు వచ్చింది.

కొద్ది క్షణాల్లో వారికి యెదురుపడింది సుజాత. సుజాతను చూడగానే ప్రకాశం మొహం మ్లానమయ్యింది. అది బైటపడకుండా, కృత్రిమమైన నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు. "హల్లో సుజాతా! ఎక్కడికి బయలుదేరావు?" తనే ముందు ప్రశ్నించాడు.

సుజాతకి యెంత కోపం వచ్చిందో, చెప్పలేం. క్రింద పెదవిని పళ్ళతో గట్టిగా అదిమిపట్టి, కోపాన్ని అణచుకుందుకు ప్రయత్నించింది. మొహం రాగరంజిత మయ్యింది.

"మా బంధువుల యింటికి వెడుతున్నాలే!" అని మాత్రం అంది. మరో విధంగా చెప్పడం యిష్టంలేక.

"ఈమె సుకన్య ... త్వరలో మే మిరువురమూ వివాహం చేసుకోబోతున్నాం. పరాయివ్యక్తి కాదులే! సాధు

బంధువే! నీకూ శుభలేఖ అందుతుంది. వివాహానికి వస్తావు కదూ" నవ్వుతూనే అన్నాడు.

సుజాత కోపం యినుమడించింది ఆ కోపంలో బాధ కూడా వుంది. ఛెళ్ళున ప్రకాశం చెంపమీద చెంపకాయ కొట్టా లన్నంత వుద్రేకం వచ్చింది. కాని, తమాయించుకుంది. అతని కపట స్వభావాన్ని బైటపెట్టా లనుకుంది. అయితే అందువల్ల అపహాస్యానికి పాలయ్యేది తనే అనుకుని, ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

"అలాగే వస్తా ప్రకాశం...నీ వివాహానికి రాకుండా యెట్లా?" యెంతో కష్టంమీద ఆ మాటలు అనేసి, ముందుకు సాగిపోయింది వడివడిగా. ఆమె కళ్ళు నీళ్ళపర్యంతమయ్యాయి. చీరతో ఒత్తుకుంది. ప్రకాశం యింత కపటస్వభావి అని ఆమె యెప్పుడూ వూహించలేదు. ఆమె కాళ్ళు తడబడ్డాయి. హృద యంలో తుఫాను చెలరేగింది. వెనక్కి తిరిగి మరో త్రోవ గుండా యింటి ముఖం పట్టింది.

"ఈమె ఎవరు ప్రకాశం? ఆమెతో అంత చనువుగా మాట్లాడుతున్నా వేమిటి?" స్త్రీ సహజమైన అనుమానాన్ని వ్యక్తంచేస్తూ ప్రశ్నించింది సుకన్య.

ప్రకాశం చిన్నగా నవ్వేడు. ఆ నవ్వులో యెంతో నిశ్చింత వున్నట్టుగా నవ్వేడు.

"అప్పుడే అనుమానం మొలకెత్తింది! నాకు తెలుసు. అయినా ఆడవాళ్ళ స్వభావమే అంత! విషయము యేమిటంటే,

మా కుటుంబంలో వీళ్ళ కుటుంబానికి మొదట్నుంచీ సన్నిహిత సంబంధం వుంది. అందుకే, అంత చనువు ఏర్పడింది."

"అంతేనా! మరేమిటో అనుకున్నాలే!" తృప్తిగా అంది సుకన్య.

"నేను చెప్పానుగా - మీ ఆడవాళ్ళ స్వభావమే అంతని." నవ్వేశాడు ప్రకాశం.

"ఆ! అక్కడికి మీ మగాళ్ళ స్వభావమే మంచిదైనట్లు చెప్తున్నావు కబుర్లు..." ప్రకాశం నవ్వులో తన నవ్వు కలిపింది సుకన్య.

అక్కడితో ప్రస్తావన కట్టిపెట్టి, పార్కు వేపు దారి తీశారు.

* * *

సుజాత యిల్లు చేరుకుంటూనే వుస్సురనుకుంటూ, కుర్చీలో కూలబడింది.

అప్పుడే లోపల్నుంచి వచ్చిన రాజ్యం, కూతురు అదోలా వుండటం గమనించి ఆశ్చర్యపోయింది.

"ఏమమ్మాయ్. అలా వున్నావు?" అంది.

సుజాత నిట్టూర్పు విడిచింది.

"అమ్మా నా వివాహ విషయములో యింక ఆలో చించకు. .ఏదో ఒక సంబంధం నీకు నచ్చినది నిశ్చయించు..." అంది.

రాజ్యాన్ని కూతురు మాటల్లోని తొందరపాటు ఆశ్చర్యపర్చింది. ఆ ఆవేశం యెందుకో. యెంత ఆలో చించినా, ఆమెకి అవగాహన కాలేదు.

"ఏమయ్యిందే? ఎందుకా తొందరపాటు? నాకు నచ్చిన సంబంధం నిర్ణయించడమేమిటి? నీకు నచ్చిన ప్రకా శము విషయంలో నాకు సదభిప్రాయం వుంది. ఇంక వేరే సంబంధం ప్రసక్తేలేదు. ప్రకాశంవంటి వుత్తముడు యీ యింటి అల్లుడు కాబోతున్నందుకు ఎంతో గర్విస్తున్నాను."

"అమ్మా ఆ నీచుడి పేరెత్తకు. ఆ పేరు తలంచితేనే పాపం!" వుద్రేకంతో అంది సుజాత.

రాజ్యం నివ్వెరపోయింది. ఆమె మొహంలోని రంగు మారింది. కూతురిలో ఈ హఠాత్పరిణామం ఎందుకు కలి గిందో ఆమెకు అనూహ్యమయింది.

"అదేమిటే సుజా అలా అంటున్నావు? ఏమయిందసలు? ఒక్కసారి నీలో యిలాంటి మార్పు యెందుకు కలిగిందో అర్థంకాదు" అంది రాజ్యం.

సుజాతకి దుఃఖం వెల్లువలా పొంగి వచ్చింది. ఏదో తెలీని బాధ ఆమె హృదయాన్ని దహించివేసింది.

"అమ్మా! ఏం చెప్పను? ప్రకాశంని నేను మనసారా ప్రేమించాను. అతడే నా సర్వస్వం అనుకొని, ఎన్నో కలలు

గన్నాను. అతడూ నాలో ఎన్నో ఆశల్ని సృష్టించాడు. తీయని మాటలతో నన్ను మైమరపించాడు. అవన్నీ నిజమని నమ్మాను. నా నమ్మకానికి నువ్వూ చేయూతనిచ్చి, మా వివాహానికి ఒప్పుకున్నావు. కాని...కాని...యిప్పుడు అతడేం చేశాడో తెలుసా అమ్మా? మరో అమ్మాయి వెంటపడ్డాడు. నన్ను మర్చిపోయాడమ్మా! ఇంతకంటె ద్రోహం, వంచన, ఇంకేం కావాలి చెప్పమ్మా? ఆమెను పెళ్ళిచేసుకోబోతున్నట్టు సిగ్గులేకుండా నాతోనే చెప్పాడు. ఛీ! ఛీ! అతడు మానవుడు కాదమ్మా!" బాధగా, కోపంగా చెప్పుకుపోయింది సుజాత.

రాజ్యం స్తంభించిపోయింది. ఆమె నోట మాట రాలేదు క్షణంసేపు. ప్రకాశంపట్ల ఆమెకి యెంత అభిమానం వుందో, అదంతా అసహ్యముగా, ఆగ్రహంగా మారింది. మనుషుల్ని ఎలా అర్థం చేసుకోవడమో, యెవర్ని నమ్మడమో, ఆమెకి అంతు చిక్కలేదు. ప్రపంచంలో యెవర్నీ అంత సులువుగా నమ్మకూడదేమో నన్న భావన ఏర్పర్చుకుంది మనస్సులో.

"ప్రకాశం ఎంతో మంచివాడనుకున్నానే అమ్మాయ్! కాని, యెంత నాటకమాడాడు? ఎప్పుడైనా కనిపించనీ— మొహం వాచిపోయేలా ఇంతగడ్డి పెడతాను! ఇంకా నయం మన అదృష్టం బావుండి, అతడి నిజరూపం త్వరలో బైట పడింది పోనీలే! పీడ విరగడయింది. నువ్వు మరేం బాధపడకు. ఆ మధ్య మంచి సంబంధం వచ్చిందని చెప్పానుగా! మళ్ళీ వాళ్ళు కబుర్లు పంపుతూనే వున్నారు. అబ్బాయి మంచి

వుద్యోగంలో వున్నాట్ట.... బావుంటాట్ట.... వాళ్ళకి స్థిరాస్తు లున్నాయట.... అది నిశ్చయించేద్దునా ?"

సుజాత, చెమ్మ గిల్లిన కళ్ళను ఓమారు ఒత్తుకుంది.

"నిశ్చయించమ్మా! ఆ బాధ్యత నీకే అప్పజెప్పాను. నీ మాటకి యెదురు చెప్పను. నా అదృష్టం యెలా వుంటే అలా వుంటుంది. దాన్నెవరూ మార్చలేరు కదా! అయితే, ఒక్క విషయం -- ప్రకాశం నా హృదయాన్ని బ్రద్దలు చేశాడు. అతడు యెప్పటికైనా దీనికి శిక్ష అనుభవించకపోడు. నా యీ కన్నీరు వూరికేపోదు...." రుద్ధస్వరంతో అంది.

రాజ్యంలోని మాతృ హృదయం చలించింది. కూతురి తల నిమురుతూ అంది.

"నిజమేనమ్మా! నీ కన్నీటికి విలువ వుండకుండాపోదు. తప్పక, నువ్వు అన్నట్టే జరుగుతుంది. ఇంక, ఆ విషయాన్ని మర్చిపో సుజాతా! నీకేం ? లక్షణమైన వరుడు దొరుకు తాడు. నువ్వు సుఖంగా వుంటావు. ఇక ప్రకాశం యెలా పోతే మనకేం ?" అంటూ ఓదార్చింది.

సుజాత అక్కణ్నించి లేచి, తన గదిలోకి వెళ్ళిపో యింది. ఆ రోజు ఆమె యెంతగా యేడ్చిందో, ఆమెకే తెలుసు. చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు. గతస్మృతులు యెన్నో గుర్తుకొచ్చి, ఆమెను కలతపర్చాయి. కాని, యేం చెయ్యగలదు -- బాధపడ్డం తప్పించి!

*　　*　　*

మానవ జీవితంలో ముఖ్యపాత్ర వహించేది కాలం. కాలం అనేక మార్పులు తెస్తుంది జీవితంలో. ఆ మార్పుల్ని నిరోధించే శక్తి యెవరికీ లేదు.

ప్రకాశం, సుకన్యల వైవాహిక జీవితం ఆనందంగానే సాగింది. కాని, ఆ ఆనందం యెంతో కాలం వుండలేదు. హఠాత్తుగా సుకన్యకి జబ్బుచేసి, ఆమె చనిపోయింది. ఆమెను బ్రతికించాలని విశ్వప్రయత్నం చేశాడు ప్రకాశం. కాని, ఫలితం శూన్యం ఆ దెబ్బ ప్రకాశం జీవితంలో వూహించ లేని మార్పు తీసుకువచ్చింది. అతనిలోని వుత్సాహం అడు గంటిపోయింది. జీవితంమీద విరక్తి పుట్టింది. నిజమే మరి! తాను మనసారా ప్రేమించిన సుకన్య, సుజాతను వంచించి పెళ్ళిజేసుకున్న సుకన్య, హఠాత్తుగా చనిపోవడం అతనికి అంతులేని బాధకలిగించిందంటే, ఆశ్చర్యమేముంది?

ఒకరోజు సుజాత బట్టలకొట్టుకి వెళ్ళి తిరిగివస్తుంటే, ప్రకాశం యెదురయ్యాడు. అతని వైఖరిచూసి, విస్తుపోయింది సుజాత. మాసినగడ్డం, లోతుకుపోయిన కళ్ళు, అతని మొహం లోని కళాకాంతుల్ని చెదరగొట్టాయి. మొహం దించుకునే నడుస్తున్నాడు. అయినా సరే, అతన్ని తప్పించుకుని వెళ్ళి పోవాలనిపించలేదు సుజాతకి.

"హలో ప్రకాశం...." పలుకరించింది.

ప్రకాశం తలెత్తిచూశాడు. సుజాత ఎదురుగావుంది. ఆమెలో సుకన్యను చూశాడు. ఇంకా సుకన్య రూపాన్ని, మనోఫలకం నుంచి మాపుకోలేకనే అలా శ్రమపడ్డాడు. సుజా

తను చూడగానే, అతనిలోని దుఃఖం పెల్లుబికింది. అణచు కున్న ఆవేదన, వెలికివచ్చింది. అతని కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది.

సుజాత విభ్రాంతి చెందింది. "అదేమిటి ప్రకాశం! కన్నీరేమిటి ?"

ప్రకాశం, గట్టిగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"ఏం చెప్పను సుజాతా: నా సుకన్య చనిపోయింది. నన్ను ఏకాకినిచేసి పోయింది నా ఆశలూ, నా కలలూ, వృధాచేసి పోయింది" రుద్ధస్వరంతో మెల్లగా చెప్పలేక, చెప్పలేక, అన్నాడు.

సుజాత క్షణం విస్తుపోయింది. తన చెవుల్ని తనే నమ్మ లేకపోయింది. సుకన్య ఇంత చిన్నవయస్సులో జీవితం చాలిం చిందా ? అంత అందమైన సుకన్యకు అకాల మరణం రాసి పెట్టివుందా: పాపం ? అనుకుంటూ ఆమెపట్ల సానుభూతి ప్రక టించింది మనస్సులో.

"సుకన్య చనిపోయిందా ? ఎలా ?" ఆశ్చర్యంతో అడిగింది.

ప్రకాశం క్షణం మౌనందాల్చి చెప్పాడు. "ఎలా అంటే. ఏం చెప్పేది సుజాతా ? ఓ రోజు యిద్దరం యింటికి తిరిగివస్తుంటే, కుండపోతగా వర్షం కురిసింది ఫలితంగా, ఆమెకి నిమోనియా వచ్చింది. ఎంత ప్రయత్నించినా, ఆమెను బ్రతి కించుకోలేకపోయాను అలాగే తనువు చాలించింది. నేను

చాలా దురదృష్టవంతుణ్ని సుజాతా. నా జీవితం ఎందుకూ పనికిరానిదయ్యింది." అంటూ వాపోయాడు.

సుజాతకి. సుకన్యమరణం బాధకలిగించిన మాట వాస్తవమేగాని, తద్వారా ప్రకాశం అనుభవిస్తున్న ఆ వేదన ఆమెకి ఆనందం కలిగించిందనే చెప్పాలి. ఆమె వెటకారంగా ఓ చిన్న మందహాసం చేసింది. ఆమె మొహం రంగులు మార్చుకుంది.

"నిజంగా బాధపడుతున్నావా ప్రకాశం ?" ప్రకాశం కేసి చూస్తూ అంది.

ప్రకాశం సుజాతకేసి ఆశ్చర్యంగా చూశాడు. ఆమె ఆ విధంగా ప్రశ్నించడం అతనికి కోపం కలిగించింది కూడాను. "ఏమిటి సుజాతా అలా అడుగుతున్నావు? నా ప్రేయసి, నా జీవిత సర్వస్వం అయిన సుకన్య చనిపోతే, నేను బాధ పడనూ ? నా మనస్సును చూడగలిగేశక్తి నీకు వున్నట్టయితే నీకు అర్థమయ్యేది, అందులో ఎంత బాధ నిండివుందో ?"

"బాధంటే యేమిటో, యిప్పుడు నీకు తెలుస్తోందన్న మాట! ఏం ప్రకాశం ? బాధ ఎట్లా హృదయాన్ని దహించి వేస్తుందో, యిప్పుడు అనుభూతి పొందుతున్నావు కదూ ? ఆనాడు నువ్వు నన్నూ, నా ప్రేమనూ విస్మరించి, నన్ను వంచించి సుకన్యను చేపట్టినపుడు నేను ఎంతగా బాధపడ్డానో, నా హృదయం ఆ బాధతో ఎన్ని బీటలువారిందో, ఒక్క సారి వూహించుకో: అప్పుడు నువ్వు కాస్తయినా నా గురించి ఆలోచించావా? నీ స్వార్థం నువ్వు చూసుకున్నావు. నేను

ఏమవుతానో అనేధ్యాసే నీకు లేకపోయింది. ఆ విధంగా నన్ను వంచించావు. నాకు తీరని మనోవ్యథ కలిగించావు. కాని యిప్పుడు నీ విషయంలో ఏమయ్యింది? నన్ను వంచించి నందుకు, నువ్వేం సుఖం అనుభవించావు? నీకిప్పుడు మిగిలిందేవిటి? దుఃఖం ఆ వేదన... ఎవరికోసమైతే, నన్ను వంచించి దూరం చేశావో, ఆమె—నీకూ యీ ప్రపంచానికీ దూరమయ్యింది. ఆమె అకాల మరణానికి నే నెప్పుడూ సానుభూతి చూపిస్తాను. కాని నీవు అనుభవిస్తున్న బాధకి, నా సానుభూతి లేదు. ఇది భగవంతుడు నీకు విధించిన శిక్ష ప్రకాశం! ఇప్పుడు నువ్వు అనుభవిస్తున్న బాధతో పోల్చుకుని, అప్పటి నా ఆవేదన అర్థం చేసుకో! నిజానికి నా ఆవేదన అశాశ్వతమైనది. ఇప్పుడు నేను ఓ ఇంటి దాన్నయి సుఖంగా వున్నాను. గతాన్ని ఏనాడో మర్చిపోయాను. కాని, నువ్వు శాశ్వతమైన ఆవేదనని అనుభవిస్తున్నావు. ఇది నీకు నీడలా ఎప్పుడూ వెన్నంటుతూనే వుంటుంది." వుద్రేకంతో అంది.

ప్రకాశంకి మొహం తిరిగినట్టయింది. సుజాత, తన స్థితికి విచారించి, సానుభూతి చూపుతుందనుకున్నాడుగాని, యిలా ఎదురు దెబ్బతీసి, గాయపడిన తన హృదయాన్ని కెలికి వేస్తుందనుకోలేదు.

"చాలా క్రూరంగా మాట్లాడుతున్నావు సుజాతా!" బాధగా అన్నాడు

సుజాతకు ఆ మాటలు కాస్త బాధ కలిగించాయి. ఎంతయినా ఆమె స్త్రీ! ఏదో వుద్రేకంతో అలా అనేసింది గాని, యింక అతన్ని బాధించదల్చుకోలేదు.

"ఈ పరిస్థితుల్లో నేనిలా చెప్పి పొడవడం, నీకు బాధగానే వుండొచ్చు. నా మాటలు కఠోరంగానే వినిపించవచ్చు కాని ప్రకాశం—నీ వంచన నీకు గుర్తుతేవడానికి, నా బాధ నీకు అర్థమయ్యేలా చెయ్యడానికి, యింతకంటే మంచి తరుణం దొరకదేమోననిపించింది. అందుకే, నా మనసులోని ఆగ్రహాన్ని వ్యక్తం చేశాను. క్షమించు...వస్తా"....అంటూ, అతని మాటకైనా యెదురుచూడకుండా ముందుకు సాగిపోయింది. ఆమె కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. చీర చెంగుతో ఒత్తుకుంది.

ప్రకాశం స్తంభించిపోయాడు. వెళ్ళిపోతున్న సుజాతకేసి కళ్ళప్పగించి క్షణం చూస్తూ వుండిపోయాడు. గతమంతా అతని కళ్ళకు కట్టినట్టుగా కనిపించింది. బాధగా ఓ నిశ్వాసం వదిలి, అక్కడ్నించి కదిలాడు. అతని కళ్ళు నీటిమయమయ్యాయి. సుకన్య లీలగా అతనికి కనిపించింది. బాధగా, భారంగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయాడు, తప్పుచేసిన వాడిలా మొహం దించుకుని.

కథా నిలయం
శ్రీకాకుళం